క్లుప్తంగా

ఎండీయూడీఎస్‌ను కలిసిన పెడన మున్సిపల్ కమిషనర్



పెడన: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీ టు గవర్నమెంట్ ఐఏఎస్ అధికారి కె.కన్నా బాబును బుధవారం అమరావతిలో పెడన మున్సిపల్ కమిషనర్ గోపాలరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకేను అందజేశారు. పెడన పట్టణ ప్లానింగ్ విభాగం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర ఉన్నారు.

విద్యార్థులు హక్కులపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య



మచిలీపట్నంటౌన్: రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరునికి సంక్రమించిన హక్కులపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక చిలకలపూడిలోని ఏపీ రెసిడెన్షియల్ మైనారిటీ బాలుర పాఠశాలలో బుధవారం మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి రామకృష్ణయ్య భారత రాజ్యాంగంలో పొందుపర్చిన పలు సాధారణ హక్కులు, మైనారిటీల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి అబ్దుల్ రబ్బాని, పాఠశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు చీలి మునలయ్య, అజ్మతున్నీసా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన



మోపిదేవి: జీవామృతం తయారీ విధానంలో నైపుణ్యత కలిగి ఉండాలని ఘంటశాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. మోపిదేవి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీవామృతం తయారీ, నైపుణ్యతపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ వెంకట లక్ష్మి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవామృతం తయారీ విధానాన్ని నైపుణ్యత ప్రదర్శన ద్వారా వివరించామన్నారు. ఈ జీవామృతం తక్కువ ఖర్చుతో వివిధ పంటలో వరి, మినుము, కూరగాయ మొక్కలకు వినియోగించుకోవచ్చనన్నారు. తద్వారా నాణ్యమైన పోషకాలు అందించడంతో పాటు భూమి సారవంతంగా పెరుగుతుందని చెప్పారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.జయంతి, ఐసీఆర్పీ విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ మృతికి నివాళులర్పించిన కౌన్సిల్




పెడన: పట్టణంలోని 14వ వార్డుకు చెందిన కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మ అకాల మరణం పట్ల బుధవారం కౌన్సిల్ ఘనంగా నివాళులర్పించింది. కౌన్సిల్ సమావేశం హాలులో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. నాగమల్లేశ్వరమ్మ పట్టణాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలనందించారని, ఆమె మృతి బాధాకరమని చైర్‌పర్సన్ అన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, టీపీవో సుజనాకుమారి, సిబ్బంది ఉన్నారు.

కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలి

అవనిగడ్డ: రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ని అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భేషరతుగా క్షమాపణ చెప్పాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విపక్షాలు అంబేడ్కర్ గురించి మాట్లాడినపుడు ఆయన పట్ల వ్యంగ్యాస్త్రాలు సంధించిన అమిత్‌షా నిజస్వరూపం బయట పడిందన్నారు. అంబేడ్కర్ నామస్మరణకు బదులుగా రామనామ జపం చేస్తే మోక్షం లభిస్తుందని చెప్పారు. ఆయనకు మోక్షం కావాలంటే హిమాలయాల్లోకి వెళ్లి తపస్సు చేసుకోవాలని, అంతేగాని అంబేడ్కర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

ప్రజలను బెంబేలెత్తిస్తున్న దోమలు

- అధ్వాన పారిశుద్ధ్యంతో దోమల విజృంభణ
- అంటు వ్యాధుల భయంలో ప్రజానీకం
- పటిష్ట చర్యలు తీసుకోవాలంటున్న పెడన ప్రజలు



పెడన: పెడనలో దోమల విజృంభణతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. పాలకవర్గం వైఎస్సార్ సీపీ కావడంతో వీరు చెప్పినా సిబ్బంది సరైనా రీతిలో స్పందించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ కూటమి నేతలు పాలకవర్గాన్ని ఇబ్బంది పెట్టాలనే ఆలోచనతో అడుగులు ముందుకు వేస్తున్నారే తప్ప ప్రజల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. వెరసి ప్రజలు దోమల బారిన పడుతున్నారు. జ్వరాలతో కొన్ని సందర్భాల్లో ప్లేట్ లెట్‌లు పడిపోయే పరిస్థితి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

చర్యలు నిల్..

పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్యం మెరుగుపడితే దోమల బెడద కూడా తగ్గుతుందని తెలిసి కూడా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లా స్థాయిలో మలేరియా అధికారులు, సిబ్బంది వచ్చిన సమయంలోనే గంబూషియా చేపలు, ఆయిల్‌బాల్స్ వదలడం, దోమల నివారణకు మందులను పిచికారీ చేయడం వంటివి చేస్తున్నారు. ఆరు నెలలకు ఒకసారి వచ్చి చేయడమే తప్ప ప్రత్యేక చర్యలంటూ ఏమీ లేవని ప్రజలు చెబుతున్నారు. చర్యలు తీసుకోకుంటే ఇబ్బందులు తప్పవంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులను సైతం దోమలు హడలెత్తిస్తున్నాయి. తరగతి గదుల్లో సైతం చేరి కాళ్ల వెంబడి కుడుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పాఠశాలల్లో రక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు అంతంత మాత్రమే..



పరిస్థితి మా దృష్టికి వచ్చింది. పురపాలక సంఘ ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. వచ్చిన ఆదాయం సిబ్బంది జీతాలకే సరిపోతుంది. ఈ ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులకు పరిస్థితి తెలియజేశాం. వారు మలేరియా డిపార్ట్‌మెంటు వారిని వారం రోజులు కిందట పంపించారు. వారి సహకారంతో పట్టణంలో దోమల నివారణ చర్యలు చేపట్టాం.

– కటకం ప్రసాద్, సీనియర్ కౌన్సిలర్, పురపాలక సంఘం, పెడన

చర్యలు తీసుకుంటున్నాం..



మలేరియా డిపార్ట్‌మెంట్ వారు ఇటీవల వచ్చారు. వారి సహకారంతో పట్టణంలోని ఐదు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిలో గంబూషియా చేపలను వదిలాం. అలాగే పలు చోట్ల దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్‌ను వేయించాం. ప్రత్యేక చర్యలు చేపడతాం. ఫాగింగ్, పిచికారీ పనులు చేపట్టాలని ఆదేశించాం. దోమల నివారణకు తప్పనిసరిగా పటిష్ట చర్యలు తీసుకుంటాం.

– ఎం.గోపాలరావు, కమిషనర్, పురపాలక సంఘం, పెడన

పార్టీలకతీతంగా ప్రజాభిమానం పొందాలి

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ చినబాబు



బంటుమిల్లి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఈ నాగేశ్వరరావు

బంటుమిల్లి: గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ గ్రామాభివృద్ధి సాధించి, ప్రజల అభిమానం పొందాలని ఎంపీపీ వెలివెల చినబాబు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నీరాజాక్షి పర్యవేక్షణలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో సమస్యలపై అధికారులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిలదీశారు. సమావేశంలో పైప్‌లైను వేసి నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని మల్లంపూడి సర్పంచ్ రేవు శ్రీనివాసరావు ప్రశ్నించారు. బంటుమిల్లిలో మైక్రోఫిల్టర్ మరమ్మతులపై ఎంపీటీసీ కమాల్‌బాషా అధికారులను నిలదీశారు. ఈ సమస్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగేశ్వరరావు వివరణ ఇచ్చారు. అగ్నిప్రమాదాల నివారణకు వెళితే చెరువులో నీరు తీసుకోకుండా పెందుర్రు గ్రామ సర్పంచ్ అడ్డుకున్నారని ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో చెరువులు లీజుకు ఇచ్చిన ప్రజావసరాల కోసం నీరు తీసుకునే హక్కు ఉంటుందని ఈ విషయం పై ప్రజాప్రతినిధులు అవగాహన చేసుకోవాలన్నారు.

కక్ష సాధింపు చర్యలు వద్దు..

ఈఓపీఆర్డీ శైలజకుమారి మాట్లాడుతూ.. ఊర చెరువులు లీజుకు తీసుకున్న గ్రామావసరాలు, ప్రజలు, పశువుల అవసరాలను అడ్డుకోకూడదని నిబంధన ఉందన్నారు. ఆముదాలపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు వస్తే విధుల నుంచి పక్కన పెట్టారని విచారణ చేశారా, ఆర్థిక లావాదేవీలు ఏమైనా జరిగాయా, తూతూ మంత్రంగా విచారణ చేసి విధుల నుంచి ఎలా తొలగిస్తారని ఏపీఓని నిలదీశారు. ఇటీవల గ్రామంలో జరిగిన సోషల్ ఆడిట్‌లో ఏమైనా ఫిర్యాదులు వచ్చాయా బహిరంగ విచారణలో జిల్లా అధికారులు ఏమి చర్యలు తీసుకున్నారని అడిగారు. దీనిపై ఏపీఓ సైదారావు సరైన వివరణ ఇవ్వకపోవడంతో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ స్థాయి సిబ్బందిపై తొందరపడి కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. హౌసింగ్ ఏఈఈ మణికంఠ తన నివేదిక ఇవ్వగా మండలంలో జగనన్న కాలనీల్లో స్థలాలు ఇచ్చాం, ఇళ్లు కట్టుకున్నారు కానీ కాలనీల్లోకి ఆటో కూడా వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని ఎంపీపీ చినబాబు విచారం వ్యక్తం చేశారు. వేసవి నాటికి విద్యుత్, తాగునీరు, రోడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే లబ్ధిదారులు కాలనీల్లో నివాసం ఉంటారని ఆయన చెప్పారు. అనంతరం పలు శాఖల అధికారులు శాఖలవారీగా తమ నివేదికలు సమర్పించారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, వైస్ చైర్మన్లు ఓ.చిన్నారిబాబు, కె.లలిత, బంటుమిల్లి డీసీ చైర్మన్ బొర్రా కాశీవిశ్వేశ్వరరావు, సీడీపీఓ ఎం.సముద్రవేణి, ఎంపీటీసీలు ఎం.లక్ష్మీశకుంతల, టి.లక్ష్మి, ఏ.వెంకటేశ్వరమ్మ, ఎం.రుక్మిణి, పలు గ్రామాల సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న ఈటీసీ లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు

నాగాయలంక: స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ 2025–26పై స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు మండలంలోని వివిధ శాఖల ఉద్యోగులకు చేపట్టిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. నాగాయలంక స్థానిక ఎంపీడీవో జె.కె.సీతారామ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రెనింగ్ సెంటర్(ఈటీసీ) లైజనింగ్ అధికారి కె.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఆరోగ్య గ్రామాలు, స్నేహపూర్వక గ్రామాలు, నీటిసమృద్ధి గ్రామాలు, స్వచ్ఛభారత్ మిషన్ – గ్రామీణ్, సంపూర్ణ పారిశుద్ధ్యం – లక్ష్యం తదితర అంశాలపై ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. మండల తహసీల్దార్ ఎం.హరనాథ్, ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ టీవీఎస్ ముత్యాలు, వెలుగు ఏపీఎం కె.వై.దాసు, డాక్టర్ ఫాతీమున్నీసా, సీహెచ్ఓ శివయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.నిర్మల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.కిశోర్‌బాబు, ఎఫ్‌టీసీ డీపీఆర్ఎల్ సీహెచ్ అజయ్ తదితర అధికారులు వివిధ అంశాలపై క్లాసులు నిర్వహించారు. 165 మంది సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, గ్రేడ్ – 1 నుంచి గ్రేడ్ – 5 కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ శిక్షణకు హాజరయ్యారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు



వాసవీ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు

పెడన: పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీ క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ(చిన్నా) అన్నారు. ధనుర్మాసం మూడో రోజైన బుధవారం శ్రీ కృష్ణుడు ఉత్సవ విగ్రహానికి 21 ద్రవ్యాలతో అభిషేకాలు, శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవెంకటేశ్వర స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొల్లూరి చిన్నా, మంజులత దంపతులచే ఆలయ ప్రధాన అర్చకుడు స్వర్ణ సాయిబాబు పూజలను జరిపించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామివార్లకు పంచ హారతి, నక్షత్ర హారతి, ఏక హారతి, కుంభహారతి, నాగ హారతి, త్రిముఖ హారతులిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు జవ్వాజి నాగు, తాడేపల్లి రామకృష్ణ, కొమ్మూరి చంద్రశేఖరరావు, బూరగడ్డ భాస్కరరావు, కొల్లూరి భాస్కర్, భవిరిశెట్టి రాఘవరావు, పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి ప్రధాన కార్యదర్శి మామిడి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు..

పెడన: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలో వేం చేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. స్వామివారికి సుప్రభాత సేవ, ఆండాళ్ల గోష్టి, మహిళా భక్తులు మంగళహారతులతో దేవాలయానికి చేరుకుని గోదా శ్రీనివాస స్వామి అష్టోత్తర శతనామావళి పాటించారు. గోదాదేవి పాడిన పాటలు తిరుప్పావై భక్తి శ్రద్ధలతో పఠించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం హరికృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులిచ్చారు.

సంక్రాంతి ఉత్సవాలు తెలుగు సంస్కృతికి ప్రతీక



సంక్రాంతి పోటీల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నిర్వాహకులు

అవనిగడ్డ: సంక్రాంతి ఉత్సవాలు తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్రాంతి సంబరాలు, 3కే రన్ కార్యక్రమం పోస్టర్లను బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంప్రదాయ పోటీలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ ఎన్ఆర్ఐ బాలాజీని అభినందించారు. వచ్చే ఏడాది మచిలీపట్నం హిందూ కళాశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కబడ్డీ పోటీలు, జెడ్పీ సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వరకు 3కే రన్ పోటీలను నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బాలాజీ తెలిపారు. జనవరి 4వ తేదీన మ్యాథ్స్ ఒలంపియాడ్, వ్యాసరచన, క్విజ్, 5న చదరంగం, 8, 9, 10 తేదీల్లో మూడు విభాగాల్లో కబడ్డీ పోటీలు, 12న 3కే రన్ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి చైర్మన్ మండలి వెంకట్రామ్(రాజా), ఫౌండేషన్ సభ్యురాలు మానస వీర్నాల, ప్రసాద్ వీర్నాల, సాయికృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

అవనిగడ్డ: రైతులకు సాగునీటి ఇబ్బందులు రాకుండా పర్యవేక్షించడంతో పాటు వారికి మెరుగైన సేవలు అందించేందుకు డీసీ చైర్మన్లు కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. నాగాయలంక నీటి సంఘం డీసీ చైర్మన్‌గా ఎన్నికైన బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు బుధవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే పూలమాలవేసి అభినందించారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, పారిశ్రామికవేత్త గద్దిపాటి శ్రీనివాసరావు, టీడీపీ మండల ప్రెసిడెంట్ మెండు లక్ష్మణరావు, ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు(నాని) పాల్గొన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ట్రెజరీ ఉద్యోగి సైకం రాణాప్రతాప్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ పరామర్శించారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత



గూడూరు: మండలంలోని కప్పలదొడ్డి, పెడన పట్టణంలోని 12, 23వ వార్డుల్లోని నిరుపేద వృద్ధులకు బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. పెడన బొడ్డు నాగయ్య కళాశాల అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవి మిత్రబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 130 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. మిత్రులు జె.నాగేంద్రకుమార్(హైదరాబాద్), ఊటుకూరి నాగవర ప్రసాద్(పెడన), బోనగిరి సత్తిబాబు(భోనగిరి)ల సహకారంతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు నాగరవి తెలిపారు. కార్యక్రమంలో బళ్ల నాగేశ్వరరావు, పేరిశెట్టి గిరిధర్, పేరిశెట్టి నాగశ్రీతేజ, మేడక విశ్వేశ్వరరావు, పింజల కుమారస్వామి, ఊటుకూరి ధవళేశ్వరరావు, బళ్ల మోక్షానందరం, కుర్మా వెంకటేశ్వరరావు, ఉమ్మిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్ పట్టాల పంపిణీ



కొడాలి(ఘంటసాల): తుపాన్ నేపథ్యంలో వర్షాలకు ధాన్యాన్ని కాపాడుకునేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తాత్కాలిక పద్ధతిపై టార్పాలిన్ పట్టాలు అందజేస్తున్నట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. కొడాలి రైతు సేవా కేంద్రం వద్ద ఉచితంగా టార్పాలిన్లు తీసుకుని అనంతరం రైతులు తిరిగి ఆర్ఎస్కేల్లో అప్పగించేలా పట్టాలను టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, ధాన్యం సేకరణ మండల కమిటీ సభ్యులు వేమూరి సాయి వెంకట రమణలతో కలిసి తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీ కృష్ణలు రైతులకు బుధవారం పంపిణీ చేశారు. రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో భద్రపర్చుకోవడానికి దేవరకోట, ఘంటసాల, మల్లంపల్లి గ్రామాల్లోని గోడౌన్లను అందుబాటులో ఉంచామన్నారు. మండలంలోని 12 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ పట్టాలను అందుబాటులో ఉంచామన్నారు. వీఏఏ వై.ఆలీ, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో టార్పాలిన్లు..

బంటుమిల్లి: ధాన్యం కాపాడుకునేందుకు రైతు సేవా కేంద్రా(ఆర్ఎస్కే)ల్లో టార్పాలిన్లు సిద్ధంగా ఉన్నాయని తహసీల్దార్ వి.వి.భరత్‌రెడ్డి తెలిపారు. పట్టాలకు ఆర్ఎస్కేల్లో సిబ్బందికి కలవాలని సూచించారు.

అల్పపీడనంతో రైతుల్లో ఆందోళన



యండపల్లిలో ధాన్యానికి పట్టా కప్పుతున్న రైతులు



నాగాయలంకలో రైతులకు సూచనలిస్తున్న ఏవో సంజీవరావు

కృత్తివెన్ను: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో వాతావరణం మేఘావృతమై చిరుజల్లులు కురువడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు రైతాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కృత్తివెన్ను మండలంలో మూడు వేల ఎకరాలకు పైగా చేలల్లో రైతులు వరికోతలు పూర్తిచేసి పనలమీద ఉంచారు. ఈ సమయంలో వర్షం కరిస్తే పంటంతా పాడైపోతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

నాగాయలంక: వాతావరణశాఖ సమాచారంతో నాగాయలంక మండలంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో వర్షసూచనతో రైతుల కంట నిద్ర లేకుండా పోయింది. మండల వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం 13,750 ఎకరాల్లో వరి పంట వేయగా ఇప్పటికి 6,182 ఎకరాలలో కోతలు పూర్తయ్యాయి. వీటిలో కోసిన పనలపై 3,700 ఎకరాలు ఉండగా 1,500 ఎకరాల్లో వరి కోసి కుప్పలు వేశారు. రైతులకు జాగ్రత్తలు చెబుతున్నామని ఏఓ ఎ.సంజీవరావు చెప్పారు. మండలంలోని నంగేగడ్డ, పర్రచివర, గణపేశ్వరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని రైతులకు సూచించామని ఏఓ చెప్పారు.

నేటి విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

అవనిగడ్డ: అవనిగడ్డ రెవెన్యూ సమావేశపు హాలులో గురువారం నిర్వహించనున్న విద్యుత్ అదాలత్ సదస్సును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ కోరారు. విద్యుత్ సదస్సు ఏర్పాట్లను బుధవారం ఆయన అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. విజయవాడ కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ ఫోరం ఆధ్వర్యంలో అవనిగడ్డలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సదస్సు జరుగుతుందన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించి అన్ని సమస్యలను ఈ సదస్సు దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేదుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఈ శివనాగేశ్వరరావు, ఏఈ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు



విజయవాడలో శస్త్రచికిత్సలను పరిశీలిస్తున్న కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: నగరంలో కుక్కల నియంత్రణకు నగరపాలక సంస్థ ఎట్టకేలకు ఉపక్రమించింది. అందులో భాగంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయిస్తోంది. నగరంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలోని శస్త్రచికిత్సశాలలో శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవటంతో నగరంలోని కుక్కలను విజయవాడ తీసుకెళ్లి శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభించినట్లు కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు బుధవారం తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 25 కుక్కలను తీసుకువెళ్లి వాటికి శస్త్రచికిత్స చేసిన అనంతరం మూడు రోజులు అక్కడే ఉంచి ఆ తర్వాత ఏ వీధిలో పట్టుకుని వెళ్లామో అదే వీధిలో వదిలేయటం జరుగుతుందన్నారు. ఇలా ప్రతిసారీ 25 కుక్కలను తీసుకువెళ్లి నవోదయ వెట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్సలు చేయిస్తున్నామన్నారు. శస్త్ర చికిత్సలతో నగరంలో కొద్ది రోజులకు కుక్కల వృద్ధి తగ్గుముఖం పడుతుందన్నారు. విజయవాడలో కుక్కలకు జరుగుతున్న శస్త్రచికిత్సలను బుధవారం పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న పైడమ్మ జాతర మహోత్సవాలు



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు

పెడన: పట్టణంలో వేం చేసి ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారంతో ఐదో రోజుకు చేరాయి. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు కుటుంబ సమేతంగా పైడమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆసాది, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకటమోహనరావు ఎమ్మెల్యే దంపతులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న కంట్రోల్ రూమ్‌ను సందర్శించి భక్తులకు ఎటువంటి ఇబ్బంది పడకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆలయ ఆసాది, ధర్మకర్త తోట వెంకట రామారావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. బుధవారం భక్తులు పోటెత్తారు. శిడిబండ్లను కట్టి ఊరేగింపులుగా వాయిద్య మేళతాళాలతో నృత్యం చేస్తూ పసుపు జల్లుకుంటూ అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



వెంకటాపురంలో శ్మశానవాటికకు స్థలం కోరుతున్న మాజీ ఎంపీటీసీ జయరావ్



కమలాపురంలో అర్జీ స్వీకరిస్తున్న అధికారులు

వెంకటాపురం(మోపిదేవి): అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గావాణి తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామసచివాలయం వద్ద సర్పంచ్ తుమ్మా సోములమ్మ అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీవిద్య అర్జీలు స్వీకరించారు.

పర్రచివర(నాగాయలంక): మండలంలోని పర్రచివర గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ ఎం.హరనాథ్ నేతృత్వంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 32 అర్జీలు అందినట్లు వీఆర్వో శ్రీనివాసరావు చెప్పారు.

గూడూరు మండలంలో 39 అర్జీలు

గూడూరు: గూడూరు మండలంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 39 అర్జీలు అందాయని తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి తెలిపారు. కంచాకోడూరు, మద్దిపట్ల గ్రామాల్లో సభలు నిర్వహించారు. కంచాకోడూరులో వివిధ భూ సమస్యలపై 32 అర్జీలు, మద్దిపట్ల గ్రామంలో 7 వినతిపత్రాలు వచ్చాయన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పెడన: రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపైనే కాకుండా కుల ధ్రువీకరణ పత్రాలకు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ అన్నారు. కొప్పెల్లి గ్రామ సచివాలయంలో కొప్పెల్లి, ముచ్చిలిగుంట, ముచ్చర్ల గ్రామాలకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాలను, భూ సమస్యలపై 13 మంది అర్జీలను తహసీల్దారుకు అందజేశారు. మధ్యాహ్నం నుంచి కమలాపురంలో జరిగిన సదస్సులో తొమ్మిది మంది అర్జీలను ఇచ్చారు. నేడు చెన్నూరులో రెవెన్యూ సదస్సు జరుగుతుందన్నారు.